ఆంధ్రప్రభ - జనవరి 21, 1970

నిరుద్యోగమనే అగ్నికి రిట్రెంచ్‌మెంట్ అనే వాయువు తోడై చదువుకున్న వాళ్ళంతా భవిష్యత్తు గురించి భయంకరంగా ఊహించుకునే సమయంలో రాజారావుకి కష్టం ఉద్యోగరూపంలో వచ్చింది.

# కష్టావతారం

ఆరు నెలల సావాసంలో, వారు వీరవుతారన్నది చాలా అనుభవంతో చెప్పిన మాట! భగవంతుడికీ, కష్టాలకీ ఉన్న సావాసం ఈనాటిది కాదు. అనాదిగా భగవంతుడు కష్టాల ద్వారా భక్తులను పరీక్షిస్తూ ఉన్నాడు. ఆ సావాస ఫలితంగా కష్టాలకు కూడా కొన్ని భగవంతుని లక్షణాలు అలవాటయాయి. అందులో అవతారాలెత్తడం ఒకటి.

కష్టాలు ఎప్పుడు ఏ రూపంలో వస్తాయో తెలియదు. మనకు సుఖం రూపంలో కనిపించినదే తరువాత తరువాత కష్టాలెత్తిన అవతారమని మనకు అర్థమవుతూంటుంది. ఉదాహరణకి ధర్మరాజు అసలు కష్టాలు అపూర్వమైన మయసభా నిర్మాణం తరువాతనే ప్రారంభమయ్యాయి.

ఇప్పుడు రాజారావుకి కష్టం ఉద్యోగం రూపంలో వచ్చింది.

అసలు అతనికి తెలియలేదు గానీ, ప్రొఫెసరుగారు పిలిచి కంగ్రాచ్యులేషన్సు చెప్పడంతో అతని అసలు కష్టాలు ప్రారంభమయ్యాయి.

"ఎందుకు సార్?" అన్నాడతను.

"నువ్వు భువనేశ్వర్ రీజినల్ రిసెర్చి లాబొరేటరీకి ఆ మధ్య ఇంటర్వ్యూకి వెళ్ళావు గదా, అందులో సెలక్టయినట్లు నాకు ఇన్‌ఫర్మేషన్ తెలిసింది. రెండు మూడు రోజుల్లో నీకు ఆర్డరు కూడా రావచ్చును....."

రాజారావు సంతోషంతో ఉక్కిరిబిక్కిరయి, "థాంక్యూ సార్" అన్నాడు.

ఆయన అప్యాయంగా అతని వంక చూసి, "విష్ యూ గుడ్‌లక్!" అన్నాడు.

రాజారావు ప్రొఫెసర్ వాసుగారి దగ్గర నాలుగైదు సంవత్సరాలుగా రిసెర్చి చేస్తున్నాడు. ఒక నెల్లాళ్ళ క్రితమే వర్కు పూర్తి చేసి థీసిస్ సబ్మిట్ చేశాడు. ప్రస్తుతం వెళ్ళిన ఇంటర్వ్యూ ఫలితాల కోసమూ, కొత్త ఇంటర్వ్యూల కోసమూ ఎదురుచూస్తున్న

తరుణంలో ఈ వార్త అతనికి తెలిసింది.

నిరుద్యోగమనే అగ్నికి రిట్రెంచిమెంట్ అనే వాయువు తోడై, చదువుకున్న వాళ్ళంతా భవిష్యత్తు గురించి భయంకరంగా ఊహించుకునే ఈ సమయంలో అతనికి ఈ వార్త తెలిసింది కాబట్టి, అది శుభవార్త అనే చెప్పాలి. శుభవార్తలు ఈయవలసిన ఆనందాన్ని ఆ వార్త అతనికి అందివ్వడము, అతను ఆనందపడడము కూడా జరిగింది. అంతలోనే, ఇంతకాలమూ తండ్రిలా తన్ను ఆదరించిన ప్రొఫెసరు వాసుగారిని, సోదర ప్రేమను మరిపించిన తోటి రిసెర్చి స్కాలర్సుని వదిలి వెళ్ళిపోవాలన్న భావం కూడా అతనిలో తళుక్కున మెరిసి, మనసు ఆర్ద్రమై ఒక్క క్షణం బాధగా నిలబడిపోయాడు.

ఆ తరువాత అతను వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు. సహాధ్యాయులు అతన్ని అభినందించి, "అదృష్టవంతుడివే య్!" అన్నారు. "అయ్యే ఉండాలి!" అనుకున్నాడతను. ఇంతలో ప్రొఫెసర్‌గారు అలా వచ్చి, "ఏమయ్యా! ఇంకా ఇక్కడే ఉన్నావు. ఈ కబురు మీ ఆవిడకి చెబితే సంతోషిస్తుంది. వెళ్ళి చెప్పవూ మరి!" అన్నారు నవ్వుతూ.

రాజారావు వెంటనే లేచి ఆయనతో, "వస్తానండి!" అని చెప్పి, లాబొరేటరీ దాటి బయటకు వచ్చేశాడు. ఇంటికి వెడుతూంటే అతనికి శాశ్వతంగా లాబొరేటరీ వదిలి వెళ్ళిపోతున్న అనుభూతి కలిగింది.

అతను ఇంటికి వచ్చేసరికి వసుంధర ఆశ్చర్యపోయింది.

"అదేమిటండీ! వెళ్ళిగంటయినా కాలేదు, అప్పుడే వచ్చేశారు?"

పాపం, పక్కింటావిడెవరో వసుంధరతో కబుర్లు చెప్పడానికని వచ్చినట్లుంది. దొడ్డిదారిన వెళ్ళిపోయింది.

రాజారావు మాట్లాడకుండా లోపల అడుగు పెట్టాడు. దాచుకుందామన్నా సంతోషం అతని ముఖంలో దాగడం లేదు. ఈ విషయాన్ని భార్యకెలా చెప్పాలా అని ఆలోచిస్తూ, అతను బట్టలు మార్చుకోసాగాడు. ఈలోగా వసుంధర తలుపు గడియ వేసి లోపలికి వచ్చింది.

"ఏమండీ! ఇంక వెళ్ళరు కదూ?" అంది సంబరంగా, బట్టలు మార్చుకుంటున్న రాజారావుని చూసి ఒక్కొక్కప్పుడు ఏమయినా మరిచిపోయినప్పుడు రాజారావు ఇంటికి వచ్చి అవి తీసుకుని మళ్ళీ వెళ్ళిపోతుంటాడు. ఇప్పుడతను మామూలుగా లుంగీపంచె కట్టేసుకోవడం చూసి, మళ్ళీ వెంటనే లాబొరేటరీకి వెళ్ళడని గ్రహించి తృప్తిగా నిట్టూర్చింది వసుంధర.

అతి ప్రయత్నం మీద రాజారావు ముఖంలోకి విషాదాన్ని తీసుకురాగలిగాడు. "నా మనస్సు బాగాలేదు, వసూ! అందుకే వచ్చేశాను" అన్నాడు.

"ఛ, అదేమిటండీ" అంది వసుంధర.

"నాకు ఉద్యోగం గురించి బెంగ పట్టుకుంది. అసలేరోజులు బాగా లేవు. అందులోనూ మనకు రికమండేషను కూడా లేదు"

"భలేవారే! ఎప్పుడూ లేని బెంగ ఈ రోజు పెట్టుకోవాలా దీనికోసం? ఉద్యోగం

రాకపోతే మాత్రం మనకి వచ్చిన లోటేమిటి? అదీ కాక రెండు మూడు రోజుల్లో మీకు ఉద్యోగం వస్తుందని నాకు బాగా నమ్మకంగా కూడా ఉంది!" అంది.

రాజారావు ఉలిక్కిపడ్డాడు 'రాదు, వసూ! ఎలా వస్తుంది?"

"వస్తుందని నేను పందెం కాస్తాను. వస్తే నా కేమిస్తారో చెప్పండి!" రాజారావుని ఉత్సాహపరచడం కోసం అంది వసుంధర.

"వస్తే...." రాజారావు ఉలిక్కిపడ్డాడు. రెండు మూడు రోజుల్లో ఆర్డరు నిజంగానే రావచ్చుమరి, అందువల్ల చేసే వాగ్దానం చెల్లించుకోవలసి ఉంటుంది. అందుకే భవిష్యత్తు తెలిసిపోతే వాగ్దానాలు చెయ్యడం చాలా కష్టం.

"ఏం, ఆగిపోయారూ!" అంది వసుంధర.

"వచ్చినప్పుడు చూద్దాం లెద్దూ!" వసుంధర ఊరుకోలేదు. "అదేం కుదరదమ్మా! వస్తే ఏమిస్తారో చెప్పవలసిందే మరి" అంటూ మారాం చేసింది.

విషయం తప్పించడం కోసం రాజారావు రసికతను ప్రదర్శించబోయాడు. "నీకొక తియ్యని...." కానీ ఆ మంత్రం వసుంధర మీద పనిచేయలేదు.

"చెప్పండి!" అంది ఆమె తమాషాగా మాట విరుస్తూ..

అలా మాట విరుస్తూ మాట్లాడ్డం ఆడవాళ్ళ ప్రత్యేకత. ఆ విరుపులో ఒక అనుకోని ఆకర్షణ, అందం ఇమిడి ఉంటాయి. ఆ విరుపులోని అందం ప్రస్తుతం రాజారావునీ ఆకర్షించగా, ఆమెవంకే చూస్తూ, "ఏం కావాలో నువ్వే కోరుకో, వసూ!" అంటూ నోరు జారాడు.

"కోరుకున్నది ఇస్తారా?" అనుమానంగా అడిగింది వసుంధర.

"ఊఁ" అన్నాడతను ఆకర్షణ మత్తులోంచి ఇంకా తేరుకోకుండా ఆమెనే చూస్తూ.

వసుంధర ముందు అలా చూస్తున్నందుకు కొంచెం సిగ్గుపడి తరవాత మొగుడే అని ధైర్యం తెచ్చుకుంది. "అయితే, అడిగేస్తున్నా మరి! ఒక బెనారస్ సిల్కు చీరా, లాకెట్ గొలుసూ, స్క్వేర్‌వాచీ- ఈ మూడే చాలు. ఇంకేమీ వద్దు!" అంది నవ్వుతూ. "అంతేకాదు, నిజంగా రెండు మూడు రోజుల్లోఉద్యోగానికి ఆర్డరు రావాలి. అవుతుంది అయ్యగారి పని" అని కూడా అనేసింది.

రాజారావు మత్తు వదిలిపోయి, "అయ్యబాబోయ్!" అంటూ మంచం మీద వెల్లకిలా పడిపోయాడు. అతని కంగారు చూసి వసుంధర ఆశ్చర్యపోయి, "అదేమిటండీ, నిజంగానే ఉద్యోగం వచ్చినంత కంగారుపడ్డారూ!" అంది.

'వచ్చినంత కంగారు పడడమేమిటి, వసూ! వచ్చేస్తేనే!" అన్నాడతను.

"ఏమిటీ, మీరనేది?" అటూ రెట్టించిన వసుంధర, అను చెప్పినదంతా విని అయిదు నిముషాలు సేపు మ్రాన్పడిపోయింది. కొంచెం సేపు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం తాండవించాక, "అయినా, మీకిదేం రోగమండీ, చెప్పేదేదో తిన్నగా చెప్పక డొంక తిరుగుడుగా చెప్పడమెందుకూ? మీకు నిజంగా ఉద్యోగం వస్తుందని తెలిస్తే ఇంత కోరిక నేను కోరకపోదును. ఇప్పుడెలా మాట నిలబెట్టుకుంటారో నిలబెట్టుకోండి!" అంది

కొంచెం విసురునీ, ఆనందాన్ని మిళితం చేస్తూ.

"ఇంతవరకూ నేను నీకెంత బాకీ ఉన్నానో లెక్కచూడు, తల్లీ!" అన్నాడు రాజారావు. వసుంధర ఓ చిన్న నోటు బుక్కు తెచ్చి లిస్టు చదవసాగింది.

"నా కథలకు వచ్చిన డబ్బు మీరే వాడేశారు. నాలుగు కథలకీ నూట అరవై అయిదురూపాయలు. పనిమనిషితో తగువు వచ్చి రెండు నెలలు నేనే పనిచేసుకున్నాను. ఆ రెండు నెలలకీ ఇరవై రూపాయలు. పేకాటలో మూడు సార్లు ఓడిపోయారు. పదిహేను రూపాయలు. ఓ నెల పంచదార పది రోజులే వస్తుందనుకున్నది నెలా వచ్చిందని ఆశ్చర్యపోయారు. ఆ ఇరవై రోజులకీ బిల్లు వేసేశాను. ఏడు రూపాయలు. ఓసారి బజారుకి వెళ్ళి నలభై రూపాయల్లో చీర కొనుక్కుందామనుకుని, మంచి చీరలు లేక గాజు సామాను కొనేశాము. ఆ బాకీ నలభైరూపాయలు.."

"బాబోయ్! ఇంక వినలేనుగాని, వాటన్నిటికీ చివర ఒక బెనారస్ సిల్కు చీరా, లాకెట్ గొలుసూ, స్క్వేర్ వాచీ రాసుకో!" అన్నాడు రాజారావు.

"అదేం కుదరదు– ఈ లిస్టు ఇండియాకు ఇతర దేశాలిచ్చేలాంటి అప్పుల లిస్టు. వసూలు ఆలస్యమైపోతుంది. మీరు అన్న ప్రకారం చేయవలసిందే!"

"నా మాటమీద నమ్మకం లేదా, వసూ!"

"ఉండవలసిందే కానీ, ఈ లిస్టు పెరిగిపోతున్నకొద్దీ నాకు తెలియకుండానే నమ్మకం తరిగిపోతూందండీ."

రాజారావు ఏం మాట్లాడాలో తెలియక జాలిగా ముఖం పెట్టి భార్యవంక చూశాడు. అతని ముఖం చూసి ఆమె కరిగిపోయింది. "సరేలెండి. మిమ్మల్ని చూస్తే జాలి వేస్తూంది. ఒక స్క్వేరు వాచీ కొనిద్దురుగాని, బెనారస్ సిల్కు చీరా, లాకెట్ గొలుసూ, వానిటీ బాగూ వద్దులో రాసేస్తాన్లెండి!" అంది జాలిగా.

"వానిటీ బ్యాగేమిటి?"

"అదే – ఆలస్యానికి వడ్డీ!"

రాజారావు భార్య ముఖంలోకి చూస్తూ, "పూర్వజన్మలో నువ్వు కాబూలీవాలా అయి ఉంటావు!" అన్నాడు.

"అవునండీ! బాకీ వసూలుకోసమని అప్పిచ్చిన వారికే పెళ్ళాన్నయి పుట్టాను. ఏం లాభం. మీరు జన్మలకు జన్మలే వాయిదా వేసేస్తున్నారు" అంది వసుంధర నవ్వుతూ.

"నీలాంటి అమ్మాయి భార్య అవుతుందంటే ఎన్ని జన్మలయినా బాకీ తీర్చను కానీ, నువ్వు మాత్రం ఒక గొప్ప సత్యం చెప్పావు – ఈ నాటి భార్యలందరూ క్రితం జన్మలో కాబూలీవాలాలు! ఆహా!" అన్నాడతను.

జవాబు వెంటనేస్ఫురించక వసుందర మూతి ముడుచుకుంది. అంతలోనే ఆమెకు భర్త ఉద్యోగం సంగతి గుర్తు వచ్చింది. "ఏమండీ! అసలు సంగతి చెప్పారు కాదు. ఉద్యోగం వస్తే మనం ఎప్పుడు అక్కడకు వెడతామండీ?"

దూరంగా భువనేశ్వర్లో మాయ అద్దంలోంచి ఈ దృశ్యాన్నిచూస్తున్న క్వార్టర్సు

రాక్షసి 'అహ్హాహ్హాహ్హా' అని వికటాట్టహాసం చేసింది. "ఉద్యోగ పర్వంలో నా ఉనికిని గుర్తించని ఈ మూర్ఖులకు సరైన గుణపాఠం నేర్పుతాను" అంటూ మరోసారి వికటాట్టహాసం చేసింది, "తొందర్లోనే!" అన్న రాజారావు సమాధానానికి కోపం వచ్చిన క్వార్టర్సు రాక్షసి.

అనుకున్న ప్రకారం రాజారావు ఆర్డర్సు అందుకున్నాడు. ప్రొఫెసరు గారూ, అతని సహాధ్యాయులూ కలిసి అతనికి వీడ్కోలు పార్టీ ఇచ్చారు. రాజారావు శాశ్వతంగా యూనివర్సిటీకి దూరమైపోయాడు.

"అక్కడికి వెళ్ళగానే ఉత్తరం రాస్తాను. క్వార్టర్సు రెడీగానే ఉంటాయంటున్నారు. లేకపోతే వెంటనే ఊళ్ళో ఏదైనా ఇల్లు చూసుకుని ఉత్తరం రాస్తాను. జాగ్రత్తగా ఉండు మరి!" అంటూ కదులుతూన్న ట్రైనులో నుంచి చేయి ఊపాడు రాజారావు. చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకుంటూ, చేయి ఊపుతూ అలాగే నిలబడిపోయింది వసుంధర.

హిందూదేశంలోని భార్యాభర్తల అనుబంధం చాలా విచిత్రమైంది. కనిపెంచిన తలిదండ్రుల్ని శాశ్వతంగా వదులుకుని, ఒక అపరిచిత వ్యక్తికి తన్ను పూర్తిగా అర్పించుకుంటుంది స్త్రీ. తనవారందరినీ, ఆ అపరిచిత స్త్రీలోనే చూసుకుంటూ, ఆమెనే ఆత్మబంధువుగా భావించుకుంటాడు భర్త. అలా కలిసిన ఆ భార్యాభర్తలా నాటి నుంచీ ఒకే వ్యక్తిగా చలామణీ అవుతారు. వారి వియోగం అంగవైకల్యం వంటిది.

వివాహమై వసుంధర కాపరానికి వచ్చిన తరువాత ఆ భార్యాభర్తలిద్దరూ ఎన్నడూ విడిపోలేదు. చుట్టుపక్కల వాళ్ళు అసూయపడేలా చిలకా గోరింకల్లా కాపరం చేశారు.

విశాఖపట్నంలో సిరిపురంలో అద్దె ఇంట్లో సామానంతా సర్దుకుని, వసుంధర భర్తనించి ఉత్తరం కోసం ఎదురుచూస్తోంది. ఏ క్షణంలో వెళ్ళి భువనేశ్వర్లో వాలుతానా అని ప్రతిరోజు, ప్రతి క్షణమూ కలలు కంటోంది. అలా ఆమె కలలు కంటున్న ఒక పగటి సమయంలో, రాజారావు వెళ్ళిన వారం రోజుల తరువాత, వసుంధరకు ఉత్తరం వచ్చింది. ఆమె ఆత్రంగా అందుకుని చదువుకుంది.

"ప్రియమైన చి. సౌ. వసుంధరకు రాజారావు ఆశీర్వదించి వ్రాయునది.

నేను క్షేమంగా భువనేశ్వర్ చేరుకున్నాను. ఏ ఇబ్బందులూ లేకుండా ఉద్యోగంలో జాయినైపోయాను. నీవు అక్కడ క్షేమంగా ఉన్నట్లు తలుస్తాను.

ఉత్తరం రాయడం ఆలస్యం చేశానని నీకు కోపంగా ఉంది కదూ? అవును, వస్తుందని నాకు తెలుసును. అయినా ఏం చేయను? నిన్ను బాధపెట్టే ఉత్తరం రాయడం ఇష్టం లేక ఇన్నాళ్ళూ ఆగి, చివరికి తప్పదనిపించి ఇప్పుడురాస్తున్నాను.

అసలు విషయం నీకు తెలియబరిచే ముందు ఈ భువనేశ్వర్ గురించి నీకు తెలియపరచాలి. ఇది ఒక పెద్ద అడవి. ఆ అడవిలో మారుమూల మృగాలు సంచరించే చోట మా లాబొరేటరీ కట్టారు. అసలు భువనేశ్వర్ అనే ఊరు వేరు. దాన్ని పాత భువనేశ్వర్ అంటారు. మన ముండేది రాజధానీ నగరం అంటారు. ఈ రాజధాని నగరంలో అద్దెకు ఇళ్ళు అంటూ దొరకవు. అనగా స్వంతంగా ఇళ్ళు ఉన్నవాళ్ళు చాలా తక్కువ. చాలా వరకూ ఊరినిండా గవర్నమెంటు క్వార్టర్సే! ఒకవేళ ఊళ్ళో ఇల్లు అద్దెకు

తీసుకుని లాబొరేటరీకి వెడదామన్నా రెండింటికీ చాలా దూరం. అంతకంటే రోజూ వాల్తేరు నుంచి రైల్లో రావడం సులభమనుకో!

ఇంతకీ ఈ ఇంటి ప్రయత్నాలను గురించి ఎందుకు రాయవలసి వచ్చిందంటే క్వార్టర్సు దొరకలేదని నీవు గ్రహించే ఉంటావు. ప్రస్తుతం రెడీగా లేవుగానీ, క్వార్టర్సు కడుతున్నారు. ఫరవాలేదండీ, అయిదారు నెలల్లో రెడీ అయిపోతాయి అని ఆఫీసులో చెప్పారు. అయిదారు నెలలంటే వాళ్ళకంత తేలిగ్గా ఉంది మరి!

ఇక్కడ హాస్టలు కూడా ఖాళీ లేదు. హాస్టల్లో ఒకో ఉద్యోగికి ఒకో సూట్ ఇస్తారు. సూట్‌కి నాలుగు గదులుండి సంసారానికి హంగుగానే ఉంటుంది. కొంతమంది అలాగే ఉంటున్నారు కూడా. కానీ నాకు సూట్ కూడా ఖాళీ లేదు. అందాకా ఒకబ్రహ్మచారితోపాటు హాస్టల్ సూట్‌లో ఉంటున్నాను.

ఇందు గురించి మీ నాన్నగారికి ఉత్తరం రాశాను. ఆయన బహుశా ఒకటి, రెండు రోజుల్లో వాల్తేరు వచ్చి నిన్ను తీసుకుని వెడతారు. సామానంతా నీటుగా సర్దేసి, అందాకా పక్కింటివాళ్ళకు అప్పగించి ఇల్లు ఖాళీ చేసెయ్యి. ఈ విషయం మీ నాన్నగారితో సంప్రదించి ఆయన ఎలా బాగుంటుందంటే అలా చెయ్యి.

ఏ సంగతీ ఉత్తరం ద్వారా తెలియబరుచు. మళ్ళీ ఉత్తరం రాస్తాను.

నీ ప్రియమైన ..... రాజారావు"

ఎగిరే కోర్కెల కొండల రెక్కల్ని ఈ ఉత్తరం ఆశనిపాతమై ఖండించడంతో వసుంధర తన కోర్కెలతోపాటే కుప్పలాకూలిపోయింది! అయిదారు నెలలు! ఆ తరువాత క్వార్టర్స్!" భగవాన్, 'ఏమిటీ పరీక్ష' అనుకుంది ఆమె.

'భగవాన్, ఏమిటీ పరీక్ష!' అనుకున్నాడు రాజారావు అదే సమయంలో భువనేశ్వర్లో. అతనికి రోజులు చాలా భారంగా గడుస్తున్నాయి. పోనీ, ఊరయినా బాగుందా అంటే అందముంది గానీ జీవం లేదు.

ఉద్యోగంలో చేరానన్న ఆనందమే లేకుండా నీరసంగా రోజులు గడుపుతున్న రాజారావు పది రోజులు విరహం అనుభవించిన అనంతరం ఒక శుక్రవారం రోజున భువనేశ్వర్ బజార్లో అతని పక్కన ఓ జీపు ఆగింది. అందులోంచి ఒక వ్యక్తి దిగి అతని భుజం మీద చెయ్యి వేశాడు. రాజారావు ఉలిక్కిపడి ఆ వ్యక్తి ముఖం చూసి, "మామయ్యగారూ!" అన్నాడు అప్రయత్నంగా.

"ఏమయ్యా! ఏమిటిక్కడున్నావ్?" అడిగారాయన.

రాజారావు వివరాలన్నీ చెప్పాక ఆయన నవ్వి, "భలేవాడివే! మేం కటక్‌లో ఉన్నామన్నమాట మరిచిపోయావా ఏమిటి?" అన్నారు.

రాజారావు తండ్రి చెల్లెలు శారద చిన్నతనంలో రాజారావును కొడుకులా పెంచింది. అతనంటే ఆమెకు చాలా అభిమానం కూడా. శారదత్తయ్యంటే రాజారావుకి తల్లి దగ్గిరుండేంత చనువూ, తండ్రిమీదుండేంత పూజ్యభావమూ ఉన్నాయి. ఆ అత్తయ్య కటక్‌లోనే ఉంటూందన్నమాట అతనికి తెలుసునుగానీ ఈ మధ్య వ్యవహారాల్లో అతనికి

గుర్తు రాలేదు.

భువనేశ్వర్ నుంచి కటక్‌కి బస్సులో అయితే సరిగ్గా నలభై అయిదు నిముషాల ప్రయాణం. ట్రెన్‌లో అయితే అరగంట మాత్రమే. రాజారావు మామయ్యగారు కటక్‌లో రైల్వేస్టేషన్‌కి చాలా దగ్గర్లోనే ఉంటున్నారు. అటువంటప్పుడు ఇంతకాలంగా భువనేశ్వర్‌లో ఉంటూ అతను కటక్ వెళ్ళకపోవటం ద్వారా మహాపచారమే చేశాడు. అందువల్ల అతను అందుకు పరిహారంగా తక్షణమే జీపు ఎక్కి మామయ్యగారితో పాటు కటక్ వెళ్ళవలసి వచ్చింది. అందుకతను చాలా సంతోషించాడు. మరునాడెలాగూ రెండవ శనివారం మూలాన సెలవు. అందులోనూ ఒంటరితనం బాధిస్తున్న ఈ రోజుల్లో అతనికి బంధు పరిచయం ఎంతయినా అవసరమనిపించింది.

ఆ రోజు రాత్రి అతనికి చాలా సమయం తన అత్తయ్యకు క్షమార్పణ చెప్పుకోవటం లోనే సరిపోయింది. తను చేసినది చాలా పెద్ద పొరపాటనీ, ఇంకెప్పుడూ జీవితంలో అటువంటి పొరపాట్లు చేయననీ రాజారావు అనడం జరిగాక శారద శాంతించి చాలా దగ్గిరలోకి తన మేనల్లుడు వచ్చినందుకు అప్పుడు సంతోషించింది.

"అమ్మయ్య!" అని రాజారావు నిట్టూరుస్తుండగా శారద ముఖం మళ్ళీ కోపంగా మారిపోయింది. ఎందుకో అర్థం కాని రాజారావు భయంభయంగా అత్తయ్యవంక చూశాడు, నిట్టూర్పు సగంలో ఆపేసి.

"ఒకసారి మా ఇల్లు చూడు" అందావిడ.

"చూశాను, చాలా బాగుంది!" అన్నాడు రాజారావు.

"బాగుండడం కాదురా - ఎంతుందో చూడు!"

"మీకేం చాలా అదృష్టవంతులు. మీరే ఊరు వెళ్ళినా మీకు చాలా పెద్ద క్వార్టర్సు ఇస్తారు!" అన్నాడు రాజారావు అత్తయ్య ప్రశ్నను అపార్థం చేసుకుని.

"నేను మా అదృష్టాన్ని పొగడమని ప్రశ్న వేయలేదు. ఈ ఇంట్లో ఎంతమందిమి ఉంటున్నాము? ఇంకా ఎంతమందికి సరిపోతుందో చెప్పు!" అందావిడ మెల్లిగా విషయంలోకి దిగుతూ.

ఇంకా రాజారావుకి విషయం అర్థం కాలేదు "మీరు మొత్తం నలుగురుంటు న్నారు. ఇంకో రెండు... మీలాంటి కుటుంబాలకు సులభంగా సరిపోతుంది మీ ఇల్లు!" అంటూ మళ్ళీ వాళ్ళ అదృష్టాన్ని పొగడబోయి భయం వేసి ఆగిపోయాడు.

"అది సరేలే కానీ, రెండు కుటుంబాలకు కాకపోతే- మరొక కుటుంబానికైనా సరిపోతుందటావా?"

ఆవిడ ఉద్దేశ్యం అర్థం కాని రాజారావుకి చిరాకేసింది, "అసలిదంతా ఎందుకడుగు తున్నావో నాకర్థం కావడం లేదత్తయ్యా" అన్నాడు.

శారదత్తయ్య ముందు నవ్వింది. తరువాత అతనివంక జాలిగా చూసింది, "నువ్వేదో తెలివైన వాడివనుకున్నానురా! కానీ ఎందుకూ పనికిరాని వాడివని ఇప్పుడే తెలిసింది."

రాజారావుకి కోపం వచ్చి "సరేలే, నువ్వు చాలా తెలివైన దానివేలే! అసలు ఈ మాటలన్నీ అనడానికే కాబోలు నన్నిక్కడకు రప్పించింది" అన్నాడు.

కానీ పాపం, అతను అసలు విషయం మరిచిపోయాడు. అతని కోపానికి ఏమాత్రమూ విలువ ఇవ్వని వాళ్ళలో శారదత్తయ్య ముఖ్యురాలు. చిన్నతనం నుంచీ ఆవిడకి అతన్ని రెచ్చగొట్టి, ఏడ్పించడం బాగా అలవాటు.

"అది సరేకానీ, వెర్రిమొగమా, ......... రోజూ ఎనిమిది గంటలకు బస్సొకటి బయల్దేరి భువనేశ్వర్‌కి వెడుతుంది. సరిగ్గా నీ లాబొరేటరీ టైముకి అందిస్తుంది. ఆ తరువాత సాయంత్రం కూడా మీ లాబొరేటరీ వదిలే టైముకి మరో బస్సుంది. అది సరిగ్గా అయిదుంపావూ, అయిదున్నర కల్లా కటక్ వస్తుంది. నెలకు నలభై రూపాయల లోపులో పాసు కూడా ఉంది. కాబట్టి నువ్వు మీ ఆవిణ్ణి ఇక్కడికే తెచ్చుకుని ఎందుకుండగూడదూ అని అంటున్నాను నేను!" అంది ఆవిడ.

సగంలో ఆపేసిన నిట్టూర్పును పూర్తిచేశాడు రాజారావు. అతని హృదయం దడదడా కొట్టుకుంది. అతను కలలో కూడా ఎదురుచూడని అవకాశమిది. క్వార్టర్స్ దొరికే అవకాశం ఇప్పట్లో లేదని అతను పూర్తిగా నిరాశ చెందుతున్న సందర్భంలో ఎడారిలో జలాశయంలా ఈ అవకాశం కనిపించిందతనికి.

"అత్తయ్యా!" అన్నాడతను ఆశ్చర్యం, ఆనందం, ఆప్యాయత, కృతజ్ఞత, ఇంకా రకరకాల భావాలు మేళవించిన కంఠంతో. అత్తయ్య ఏ భావమూ లేకుండా నవ్వుతోంది.

"ఆలోచించి చెబుతానత్తాయ్యా!" అన్నాడు రాజారావు మరో నిముషం ఆగి. అసలతనికి వెంటనే ఒప్పుకోవాలనుకుంది కానీ సంకోచించాడు.

రాజారావు లాబొరేటరీలో చేరిన సందర్భంలో లాబొరేటరీ డైరెక్టరు, అసిస్టెంటు డైరెక్టరు కూడా ఊళ్ళో లేకపోవడం వల్ల అతనికి ప్రత్యేకమైన పని అంటూ ఏదీ ఇవ్వబడలేదు. కొంత సేపు లైబ్రరీలో శాస్త్రీయ విజ్ఞాన గ్రంథాలు పఠించినా, చాలా కాలం అతను ఆలోచనలో గడిపివేస్తుండేవాడు. ప్రతి విషయాన్ని తరిచి తరచి ఆలోచించడం ద్వారా అతనికి చాలాకాలం గడిచిపోయేది. ఈ విధంగా అతనికి ప్రతి విషయానికీ ఆలోచించడం అలవాటైపోయింది. ఆలోచన ద్వారా తన తల్లినే బ్రతికించుకున్న చిరకారి అతని కిప్పుడు ఆదర్శమైపోయాడు.

అదే ఇప్పుడు రాజారావుని రక్షించింది. ఆలోచించి చెబుతాననడం మంచిదే అయింది.

ఆ రాత్రి అతనికి త్వరలోనే భార్య తన వద్దకు రాబోతూందనే ఉత్సాహంతో నిద్రపట్టలేదు. దేవుడెంతో మంచివాడనుకుని, నమస్కారం పెడదామనుకుని చుట్టూ గోడలవంక చూశాడు. ఒక గోడకి వెంకటేశ్వరస్వామి బొమ్మ క్యాలండరు కనిపించింది. వెంటనే నమస్కరించబోయి ఆగాడు. అతను రెండు చేతులూ జోడించే సమయానికి, ఆ పటంలో వెంకటేశ్వరస్వామికి బదులు అత్తయ్య బొమ్మ కనిపించిందతనికి. ఆశ్చర్యంగా అతను ఆ బొమ్మకే నమస్కరించిన అనంతరం ఆ బొమ్మ మళ్ళీ వెంకటేశ్వరస్వామిగా

మారిపోయింది!

అప్పుడతనికి అసలు విషయం అర్థమయింది. తన నమస్కారానికి దేవుడు అర్హుడు కాదు. అందుకే ఆయన ఆ క్షణంలో తప్పుకుని, అర్హులను ఆ స్థానంలో ఉంచాడు. దేవుడి దయే తనకు ఉంటే భువనేశ్వర్‌లోనే క్వార్టర్సు దొరికేవి.

దేవుడి దయ రాజారావుకి లేదని మరునాడే ఋజువయింది.

ఇంకా రాజారావు ఆలోచన పూర్తి కాకుండానే అతను ఆలోచించవలసిన అవసరం లేకుండాపోయింది.

"సరదాగా మనం కలిసి కొన్నాళ్ళుందామనుకుంటే లేకుండాపోయిందిరా! ఈ వెధవ ట్రాన్స్‌ఫర్ ఇప్పుడే వచ్చిఏడవాలా!" అంది శారదత్తయ్య ముఖం నిండా నిరాశ పులుముకుని మరునాడు సాయంత్రం.

రాజారావు కాస్సేపు అత్తయ్యని ఓదార్చి, తరువాత తనని తాను ఓదార్చుకున్నాడు. అలా బజారులోకి వెళ్ళి వసుంధరకు తను రాసిన ఉత్తరం, ఇంకా పోస్టు చేయనిది, ముక్కలు ముక్కలు చేసి గిరవాటెట్టాడు. చిరిగి ఎగిరే ఆ ముక్కలను చూసి, తన హృదయంతో పోల్చుకుని బాధపడ్డాడు. ఎడారిలో కనిపించిన జలాశయం ఎండమావి అయిపోయింది.

అత్తయ్యకు ట్రాన్స్‌ఫర్ అయిపోయింది. మరో వారం రోజుల్లో వాళ్ళు కూడా కలకత్తా వెళ్ళిపోతారు. తను కన్న కలలన్నీ భగ్నమైపోయాయి. అత్తయ్య ఎంతో మంచిది. అయినా ఎంతమంది మంచివాళ్ళుండిఏం లాభం, దేవుడు చెడ్డవాడయినప్పుడు?

అత్తయ్యావాళ్ళ కుటుంబం కలకత్తా వెళ్ళిపోయిన రెండు రోజులకే రాజారావుకి మరో మంచిమనిషి పరిచయం లభించింది. ఆ మంచివాడు ఒక తెలుగువాడు. పేరు సదానందం.

సదానందంతో రాజారావుకి పరిచయం ఇదివరకే ఉన్నప్పటికీ, చాలామంచి వాడుగా పరిచయం కావడం ఇదే మొదటిసారి.

సదానందానికీ, రాజారావుకీ చాలా తేడా ఉంది. సదానందానికి అతని పేరు చక్కగా అతికింది. అతను ఎప్పుడూ సంతోషంగా ఉంటాడు. సృష్టిలో ప్రతి విషయమూ అతనికి ఆనందాన్ని కలిగిస్తుంది. అయితే, అతనికి క్వార్టర్సు ఉన్నాయి. అదే అతని ఆనందానికి కారణమని రాజారావు ఉద్దేశ్యం. నాకూ క్వార్టర్సుండి, నా వసు నాదగ్గరే ఉంటే నేనూ సదానందానికి వెయ్యిరెట్లు ఆనందంగా ఉండగలను!' అనుకుంటూంటాడు రాజారావు. సదానందం ఆనందానికి నిబంధనలు లేవు అని రాజారావుకి తెలియదు. తెలియచెప్పడం కోసమన్నట్లుగా ఓ రోజున... అనగా రాజారావు అత్తయ్యావాళ్ళూ కలకత్తా వెళ్ళి పోయినరెండు రోజులకి, సదానందం హఠాత్తుగా మంచివాడైపోయాడు.

అతను తన భార్యను పుట్టింటికి పురిటికి పంపించేస్తున్నట్టుగా సంతోషంగా తెలియబరిచాడు రాజారావుకి. అతని సంతోషానికి రాజారావు ఆశ్చర్యపోయి "మీ ఆవిడ వెళ్ళిపోతున్నందుకు బాధగా లేదూ!" అన్నాడు.

సదానందం చిరునవ్వు నవ్వి, "భలేవాడివయ్యా, బ్రదర్! విరహంలో రెండు రకాల మజాలున్నాయి. మొదటి రకం ఏమిటంటే కొత్త తరహా జీవితం. పుట్టింట్లో రాకరాక వచ్చిన మా ఆవిడ రాణీగారైపోతుంది. ఇక్కడ నేను కనకరాజు మెస్సూ, పేకాటలతో కొన్నాళ్ళపాటు క్రమబద్ధమైన జీవితానికి స్వస్తి చెబుతాను. అలా కొన్ని నెలలు గడిచిపోయేసరికి మా ఆవిడకీ, నాకు కూడా ఒకళ్ళమీద ఒకళ్లకి గాలి మళ్ళుతుంది. ఆ మళ్ళడంతో కొత్తరకం ప్రేమ ఉదయిస్తుంది. ఆ కొత్త ప్రేమ పాత ప్రేమలా ఉండదు. ఈకొత్తరకం తాజా ప్రేమతో కాపరం మొదలెడతాం. ఇక రెండవ రకం మజా ఏమిటంటే ఉత్తరాలు. ఎక్కడలేని కవిత్వమూ ఒలకబోసుకునేందుకు ఇదే అవకాశం. ప్రతి మగాడికీ, ఆడదానికీ కూడా పుట్టుక తోనే కొంత కవిత్వం అబ్బుతుంది. అది వెలికితీసే అవకాశం ఈ విరహమే కల్పిస్తుంది. ఇప్పుడు నా విరహంలో మూడోరకం మజా కూడా ఉంది. అదే నీ మజా !" అన్నాడతను.

"మధ్య నా మజా ఏమిటోయ్!" అన్నాడు రాజారావు ఆశ్చర్యంగా.

"నాలుగైదు నెలలపాటు మా అవిడెలాగూ ఉండదు కాబట్టి, నీ కభ్యంతరం లేకపోతే నువ్వు మా క్వార్టర్సులో ఉండవచ్చు. అందాకా నేను హాస్టల్లో ఉంటాను. మా ఆవిడ తిరిగివచ్చేలోపు గానే నీ క్వార్టర్సూ రెడీ అవుతాయి!"

రాజారావు ఉలిక్కిపడి, "సదానందం!" అన్నాడు. ఆ కంఠంలో నవరసాలూ ఇమిడి ఉన్నాయి. "ఆలోచించి చెబుతాను. ఈలోగా నువ్వు కూడా బాగా ఆలోచించి ఓ నిర్ణయానికి రా!" అన్నాడు చిరకారి రాజారావు.

"ఇందులో నేను ఆలోచించవలసింది ఏమీలేదోయ్! అంతా నీ ఇష్టం!"

ఉద్రేకానికి తట్టుకోలేనేమో అని భయపడి రాజారావు తక్షణమే స్నేహితుని వద్ద సెలవు తీసుకుని తన గదికిపోయి కాస్సేపు మంచం మీద మేను వాల్చాడు. అప్పటికి అతని గుండెదడా, ఆయాసమూ వగైరా తగ్గి సామాన్య పరిస్థితికి వచ్చాడు.

అంతలోనే అతనికి దేవుడిమీద గొప్ప భక్తి కలిగి, ఎదురుగా ఉన్న వెంకటేశ్వరస్వామి పటానికి నమస్కరించబోయాడు. ఆశ్చర్యంగా ఫోటోలో దేవుడి బదులు సదానందం బొమ్మ కనిపించింది. అయినా రాజారావు ఆ బొమ్మకే నమస్కరించాడు. నమస్కారం అందుకున్నాక ఆ బొమ్మ మళ్ళీ వెంకటేశ్వర స్వామిగా మారిపోయింది.

"అవును, నా నమస్కారం అందుకునే అర్హత తనకు లేదని ఆ స్వామికి తెలుసు. అందుకే అర్హుణ్ణి ఆ స్థానంలో ఉంచాడు అని గ్రహించిన రాజారావు దైవలీలలకు ఆశ్చర్యపడ్డాడు. అంతలోనే అతనికి భయమేసింది. క్రితంసారి అత్తయ్య విషయంలోనూ ఇలాగే జరిగింది. కొంపదీసి దేవుడు తన పక్షాన లేడేమో!

ఎందుకైనా మంచిదని అతను ఆ వేళకి వసుంధరకు ఉత్తరం రాయలేదు. మరునాడు కూడా సదానందం ధోరణిలో ఏమీ మార్పు లేకపోయేసరికి రాజారావుకి చాలా ధైర్యం వచ్చింది. ఆ రోజు సాయంత్రం వసుంధరకు పెద్ద ఉత్తరం తయారుచేశాడు.

అయితే, రాజారావు ఆ ఉత్తరాన్ని మరునాడే చింపివేయవలసి వచ్చింది.

సదానందం మామగారికి ఏవో సంసారానికి సంబంధించిన చిక్కులు రావడం వల్ల పురిటికి కూతుర్ని ఇంటికి తీసుకువెళ్ళడానికి బదులు అత్తగారే అక్కడికి (భువనేశ్వర్) వచ్చి, పురుడు పోయడానికి నిశ్చయించుకున్నారట. ఒకటి, రెండు రోజుల్లో తన అత్తగారు వస్తారని చెబుతూ మిత్రుణ్ణి క్షమార్పణ అడిగాడు సదానందం.

ఫిలసాఫికల్‌గా నవ్వుతూ రాజారావు మిత్రుణ్ణి క్షమించాడు. కానీ అంతలోనే అతని పిడికిళ్ళు బిగిశాయి. 'ఎక్కడ దేవుడు?' అనుకున్నాడు మనస్సులో. తన మానాన తన్ను వదిలిపెట్టక, ఆశకొలిపి మరీ ఏడిపిస్తున్నాడెందుకు ఈ భగవంతుడు? భగవంతుడిటువంటి పాడుబుద్ధులతో విసిగించడం వల్లనే కాబోలు, హిరణ్యకశిపుడూ వగైరాలు 'ఎక్కడరా ఆ హరి?' అంటూ విరుచుకుపడ్డారు.

అయినా, విరహంలోని ఆనందాన్ని అనుభవించాలనుకున్న సదానందానికి విరహం అవసరమే లేకుండాపోయింది. వద్దు మొర్రో అనుకుంటున్న తన్ను విరహం బాధించేస్తోంది.

అదే క్షణంలో అతనికి "నీవు లేక వీణా....." అన్న పాట ఎక్కణ్ణించో వినిపించసాగింది.

ఆ పాట తను వసు పాడుతున్నట్లుగా అనిపించిందతనికి. "తలుపులన్నీ నీకై తెరిచి ఉంచినాను" అని పాట వినిపిస్తూంటే రాజారావు స్వగతంలో బాధగా పాడుకున్నాడు. "తలుపులన్నీ నీకై తెరిచి ఉంతమన్న క్వార్టర్సు లేని నాకు తలుపు కూడా లేదూ!"

ఈ పాట అతనిలో భావ సంచలనాన్ని కలిగించగా అతను సజల నయనాలతో భార్యకు ఉత్తరం రాశాడు. నయనాల జలధారలవల్లనో, మరెందువల్లనో కానీ ఆ ఉత్తరానికి మరో ముప్పై పైసల స్టాంపులు ఎక్కువ అంటించవలసి వచ్చింది.

ఇంక ఆనాటినుంచీ రాజారావు ఉద్యోగవర్వంలో ఉత్తరాయణం ప్రారంభమయింది. రోజు కొక ఉత్తరం చొప్పున అతను వసుంధరకు రాయనారంభిస్తే, అంతకు రెట్టింపు వేగంతో వసుంధర దగ్గరనించి జవాబు వచ్చింది అతనికి.

అలా ప్రేమికులకి నాలుగు యుగాలైనప్పటికీ, క్రీస్తు కాలమాన ప్రకారం నాలుగు నెలలు గడిచిపోయాయి. ఈలోగా రాజారావు క్వార్టర్సు రెడీ అయ్యాయి. అనుకున్నకంటే పదిహేను రోజులు ముందుగానే క్వార్టర్సు రెడీ కావడానికి కారణం లాబొరేటరీ డైరెక్టరుగారు. ఉద్యోగుల సాధక బాధకాలను బాగా ఆలోచించిన ఆయన చాలా శ్రద్ధ వహించి, నిర్మాణం తొందరలో పూర్తికావడానికి కారకులైనారు.

ఈ నాలుగు నెలల్లోనూ రాజారావుకి సంబంధించిన చాలా విశేషాలు జరిగిపోయినవి.

గవర్నమెంటు వారికి పోస్టలు శాఖ ద్వారా అద్భుతమైన లాభాలు వచ్చాయి.

అందుకు కారణాన్ని వారు శోధించిన మీదట, తపాలా కార్డుల ధరలు పెంచడం కంటే, ఉద్యోగస్థులకు క్వార్టర్సు సదుపాయం ఆలస్యం చేయడమే పరోక్ష సుంకంగా

వర్తిస్తుందని ఒక ఆచరణీయాంశంగా నోటు చేసుకున్నారు.

రాజారావుకి మరోసారి క్వార్టర్సు దొరికే అవకాశం వచ్చిపోయింది. ఒక ఒరియా అతను నాలుగు నెలల సెలవు మీద ఎక్కడికో వెడుతూ, తన హాస్టలు సూట్‌ను రాజారావుకే ముందు ఇద్దామనుకుని, తరువాత ప్రాంతీయ విభేదాల గురించి ఆత్మవిమర్శ చేసుకుని, ఎప్పుడో పెళ్ళి కాబోయే మరో ఒరియా స్నేహితునికి ఇచ్చేశాడు.

వసుంధర 'ఇల్లు చూసుకో!' అన్న కథ రాసి, కరెక్షను కోసం రాజారావుకు పంపించింది. ఇల్లు లేని మగవాడు మగనాలికన్యాయం చేసినవాడవుతాడనీ, అద్దెదో,స్వంతానిదో ఇల్లుంటే గానీ పెళ్ళి చేసుకోకూడదనీ అందులో ఆమె ప్రబోధిస్తూ తన కథను ఉదాహరించింది. ఉద్యోగం వచ్చాక ఇల్లు చూసుకునేదాకా పెళ్ళి చేసుకోవద్దనీ, ఒకవేళ ఉద్యోగం రాకుండానే పెళ్ళి అయిపోయి ఉంటే, ఇల్లు వెంటనే సిద్ధంగా ఉన్న ఉద్యోగమే అంగీకరించాలనీ, లేని ఉద్యోగం వదిలేయాలనీ ముగించింది. చెప్పుకోదగ్గ ఈ విశేషాలతో రాజారావుకి క్వార్టర్సు లభించాయి. ఈ విషయం అతను వసుంధరకు ఉత్తరం రాయబోయే ముందు ఒకసారి వెంకటేశ్వరస్వామికి నమస్కారం చేయబోయాడు. అయితే ఆ పటంలో స్వామికి బదులు డైరెక్టరుగారు కనిపించారతనికి.

ఉలిక్కిపడి అలాగే నమస్కారం చేసిన అనంతరం ఆ పటంలో మళ్ళీ స్వామివారు వెలిశారు. ఇలా జరగడం అప్పుడే నాల్గవ సారేమో రాజారావుకి బెంగ పట్టుకుంది. మళ్ళీ ఏదో చిక్కురాబోతూందని అతనికి అనిపించసాగింది.

తన పేరున క్వార్టర్ అలాట్ అయిపోయింది. అది ఏ పరిస్థితుల్లోనూ మార్చుడం జరగదు. ఇంక దానిని భగవంతుడు కూడా మార్చలేడు. కానీ... మరి!

అప్పుడతనికి వీరేశలింగంపంతులు గారి ఆత్మ కనిపించింది. "నేను అమావాస్య నాడు ఉద్యోగంలో జాయిన్ అయినాను. తప్పుదిశగా గెలవేసిన అరటికాయల కూర తిన్నాను. నా కథ మరిచావా? మూఢ విశ్వాసాలకి లొంగావా? రిసెర్చి చేసిన నువ్వే మూఢ విశ్వాసాలకి లొంగిపోతే, సామాన్య ప్రజానీకం సంగతి ఏమిటి? నేను మళ్ళీ పుట్టాలా?" అంది.

తన మూఢ నమ్మకానికి తన్ను తనే అసహ్యించుకున్నాడు రాజారావు.

ఏది ఏమయినా అతీంద్రియ మానసిక శక్తుల మీద పరిశోధన అవసరం అని మరునాడు రాజారావు గ్రహించవలసి వచ్చింది. అతని మామగారు రాసిన ఉత్తరం అతని హృదయానికి సమ్మెటపోటులాగా తగిలి, "హారి భగవంతుడా! అటునించి నరుక్కువచ్చావా?" అని బాధపడ్డాడు.

"ఇదీ పరిస్థితి. ఇటువంటప్పుడు ఈ కొద్దిరోజుల కోసం అమ్మాయిని అటూ ఇటూ తిప్పడం నాకిష్టంలేదు"

మామగారి ఉత్తరం మడిచి భార్య రాసిన ఉత్తరంలోని ఆ భాగాన్ని మళ్ళీ చదువుకున్నాడు.

"నాకు సుమారు రెండు నెలలుగానే బాగా అనుమానం కలిగింది. అయినా

మీకు రాయడానికి సిగ్గు వేసింది. నెలా పదిహేను రోజుల క్రితం అమ్మావాళ్ళు ఈ విషయాన్ని రూఢి పరిచేశారు. ఈ విషయం మీకు నేను రాసే ఉంటానని వాళ్ళనుకుంటు న్నారు. ఇప్పుడు నాకు అయిదవ నెల నడుస్తూంది. తొలిచూలుకి అయిదవ నెలలోనే ఇంటికి తీసుకురావడం మా వాళ్ళ ఆనవాయితీ. అందుకని అమ్మా, నాన్నగారూ నన్ను పంపడానికి ఒప్పుకోవడం లేదు. ఏ క్షణంలో మీ దగ్గరికి వచ్చి వాలతానా అని ఉంది నాకు. కానీ వాళ్ళ దగ్గిర ఎలా చెప్పుకోను?"

తరువాత ఉత్తరం ఇంక చదవలేక ఊరుకున్నాను.

విరహంలో సరదా ఉందనుకునే సదానందం పెళ్ళాం ఇక్కడే పురుడుపోసు కుంటూంటే తనకు ఇలా జరిగింది! అయిదో నెల్లో తీసుకువెళ్ళడం ఆనవాయితీ అయితే మొదటి నెల్లోనే తీసుకువెళ్ళిపోయారు మామగారు!

అసలిదంతా ఇలా ఎందుకు జరిగింది? అని రాజారావు బాగా ఆలోచించగా ఆలోచిచంగా అతనికి ఒక విషయం తట్టింది.

మనిషికి కష్టాలు రకరకాలుగా వస్తాయి. భగవంతుడితోడి సావాసఫలితంగా కష్టాలు కూడా అవతారాలెత్తుతూంటాయి. ప్రస్తుతం తనకు కష్టం ఉద్యోగరూపంలో వచ్చింది. మరొకరికి క్వార్టర్సు రూపంలో రావచ్చును. కాబట్టి తన ఉద్యోగ పర్వంలోని క్వార్టర్సు కథ 'కష్టావతారం' కథ.

అయితే అసలు మనిషికి కష్టాలెందుకు వస్తాయి?

మనిషి స్వభావంలోనేకాని, అసలు కష్టాలనేవి లేవని మనకు తెలియపరచడానికి. అవును మరి. నిరుద్యోగసమస్య తీవ్రంగా ప్రబలి ఉన్న రోజుల్లో ఉద్యోగం దొరకడం ఎంత అదృష్టం? కానీ తను కష్టపడ్డాడు. కారణం - భార్యను విడిచి ఉండలేని తన దుర్బల మనస్తత్వం. అలాగే పరీక్ష పాసయినా క్లాసు రాలేదనీ, క్లాసు వస్తే క్లాసు ఫస్టు రాలేదనీ అనుకునేవాళ్ళకి చివరకు మిగిలేవి కష్టాలు. అసలు అసంతృప్తి అన్ని కష్టాలకూ మూలకారణం.

చాలా ఆలస్యంగానైనా రాజారావు ఓ జీవిత సత్యాన్ని గ్రహించగలిగాడు. అప్పుడే అతను అనుకున్నాడు. "తండ్రి కాబోతున్నందుకు ఆనందించవలసిన ఈ శుభసమయంలో వసు రావడం లేదని విచారిస్తున్నానంటే?....."

వసు గుర్తుకు రాగానే అతనికి ఆమె పంపిన కథ గుర్తు వచ్చింది. అతనా కథ ఒకసారి చదివి కొద్దిగా మార్పులు చేసి, 'కష్టావతారం' అని పేరుపెట్టి ఫెయిర్ కాపీ చేయబోతూ ముందొకసారి దేవుడికి దండం పెట్టుకున్నాడు. పటంలో వెంకటేశ్వరస్వామి ప్రసన్న దరహాసవదనుడై ఉండడం గమనించిన రాజారావు, "ఇన్నాళ్ళకి దేవుడు మళ్ళీ నావాడయ్యాడన్నమాట!" అనుకున్నాడు.

✦ ✦ ✦